# విధివ్రాత

రచన: కె. వి. రమణ

పెళ్ళి పీటలమీద వధూవరులు కూర్చున్నారు. వాయిద్యాలు మ్రోగుతున్నాయి. పెళ్లి కూతురు పెళ్ళి కొడుకు వైపుగా మెల్లగా చూపి తల దించేసుకుంది. పెళ్ళిపందిరి అతిథులందరితోనూ నిండిపోయింది. ఒక ప్రక్క వారి సంభాషణలు సాగుతూనే వున్నాయి. రెండో ప్రక్క పురోహితుల మంత్రాలు పఠింపబడుతూనే వున్నాయి.

పెండ్లికొడుకు మంగళసూత్రం కట్టవలసిన సమయం వచ్చింది. పెండ్లిపందిరి అంతా మంగళసూత్రం లిరిగి వచ్చింది. వాద్యగాళ్ళను వాయిద్యాలను జోరుగా కొట్టమని ఆజ్ఞాపించారు పురోహితులు. వాద్యగాళ్ళు వాయిద్యాలను వాయించటం మొదలుపెట్టారు.

పురోహితుడు మంగళసూత్రాన్ని పెళ్ళికొడుకు ముందరనుంచాడు. పెళ్ళికొడుకు దాన్ని తీయలేదు. చుట్టుప్రక్కల నున్నవారు చాలా ఆశ్చర్యపోయారు. ఎదుటికి చూస్తున్నాడు కాని, దాన్ని ముట్టుకోలేదు; ఎటు కూడా తలతిప్పి చూడలేదు. వాయిద్యాలు మ్రోగటం ఆగిపోయాయి. పందిట్లో అతిథుల సంభాషణలు ఆగిపోయాయి. నిశ్శబ్దం ఒక్కసారిగా ఆవరించిపోయింది.

పురోహితుడు పెండ్లికొడుకుమీద చేయివేసి కొద్దిగా ఊపాడు. ఇద్దరు ముగ్గురువచ్చి అతడ్ని ఊపారు. స్పృహ తప్పిపోయాడేమోనని అనుకున్నారు. కాని ...ఏమి జబ్బో తెలియదు, పెండ్లికొడుకు అప్పటికే యీ లోకాన్ని విడనాడాడు. అక్కడి జనత శోకమగ్నమయింది. అంతవరకూ పెళ్ళికి వచ్చిన యువతులను దొంగ చాటుగా చూస్తున్న యువకులు కూడా విచారాన్ని ప్రదర్శించారు.

''అది పెండ్లి పందిరికాదు,
నిచ్చల విడిగ జంబుకాల్
చరించు శ్మశానస్థలి;
యమ భూతలె గాని, వారు
పెండ్లికి యతిథులే గారు;
అవి వివాహ వాయిద్యాల్
కావు, మృత్యు ముఖపు పిలు
పులే యవి వాస్తవంగా,
-అటులే యనిపించు మదికి.''

వివాహానికని రప్పించబడ్డ వాయిద్యాలు పెండ్లికొడుకు శవాన్ని తీసుకు వెళ్ళడానికి వుపయోగించాయి. పెండ్లికి వచ్చిన అతిథులందరూ శవాన్ని వూరేగించటానికి వుపయోగపడ్డారు. శవ సంస్కారం జరిగిపోయింది.

పెండ్లికూతురు రమణకు ఆరోజు నిద్రాహారాలు లేవు. తనకు పెండ్లికొడుకు నచ్చాడు. కాని లాభం ఏమిటి?

కొన్నిరోజులు గడిచిపోయాయి. కొంతమంది పెండ్లికూతురు మంచిది కాదన్నారు. ఆ పెండ్లికొడుకుతో రమణకు వివాహం గావించక పోయినట్లయితే అతడు బ్రతికేవుండేవాడని లోకులనుకున్నారు. లోకుల మాటలు మేకుల్లాంటివి. వారిమాటలు హృదయాల్లో ములుకుల్లా గుచ్చుక పోతాయి.

ఎంత వెతికినప్పటికీ రమణకు మరోసంబంధం ఎక్కడా దొరకలేదు. రమణను రాక్షసి అన్నారు ఆమెవలనే పెండ్లికొడుకు చనిపోయాడన్నారు.

ఆమె సుకుమారి, నవయువతి, సుందరి. పెండ్లికొడుకుని చూసిన మరుక్షణంలోనే ఆమె తన హృదయాన్ని అతని కర్పించింది. ఆ సంబంధం స్థిరపడితే తను ధన్యురాలనని అనుకున్నది. ఆమె కోరికయే నెరవేరింది. కాని......?

* * *

రమణ యితరుల మాటల్ని వినలేకపోయింది. ఎన్నాళ్ళని బ్రహ్మచర్య జీవితాన్ని గడపగలదామె - యితరుల సూటిపోటిమాటల్ని వింటూ రమణ క్రైస్తవ మతంలో చేరిపోయింది.

''హృదయమున్న చాలున్
మత ప్రసక్తి ఏల?''

తను కోరికోరి నన్నే చర్చిలో వివాహం చేసుకుంది. నేను అందంగా వుంటానని అందరూ అంటూ వుంటారు, రమణకూడ అలానే అంటుంది. కాని నేను నా అందాన్ని అద్దంలో కూడ చూసే భాగ్యం నాకు లేకపోయింది. ప్రపంచమంతా యింతకుముందు చీకటిగా కనిపించేది. కాని యిప్పుడు రమణ నా ప్రక్కను కూర్చొని, నాకు శుశ్రూష చేస్తూ ప్రకృతిని వర్ణిస్తూంటే ఆనందాన్ననుభవిస్తూంటాను అని అంటాడు క్రైస్తవ చలపతి. అంతా విధి విలాసం.